A

# హద్దులు

అడల్ట్స్ ఓన్లీ కథ!

రాత్రి సమయం.

విజయవాడ బస్సు వేగంగా వెళుతోంది.

కూకట్‌పల్లిలో బస్సు ఎక్కిన గౌరీనాథ్‌కు కిటికీలో నుండి వస్తున్న చల్లగాలికి హాయిగా అనిపించింది.

పక్కసీటులో ఎవ్వరూ లేకపోవడంతో సౌకర్యంగా కూర్చున్నాడు. మాగన్నుగా నిద్రపట్టింది అతనికి.

వనస్థలిపురంలో బస్ ఎక్కింది గాయత్రి.

''లేడీస్ సీట్లు ఖాళీగా లేవు'' ఆమెతో చెప్పాడు కండక్టర్.

సీటు ఎడ్జస్ట్ చేయమని తర్వాత అడిగితే కుదరదు అన్న భావం ధ్వనించింది అతని గొంతులో.

పరిశీలనగా బస్సులో చూసింది.

ఒకే ఒక్క సీటు ఖాళీగా కనిపించింది. ఆ పక్కసీటులో ఒకతను కూర్చుని వున్నాడు.

''ఫర్వాలేదు. ఆ ఖాళీసీటులో కూర్చుంటాను'' అంది కండక్టర్‌తో.

టికెట్ తీసుకుని అటువైపు నడిచింది.

''ఎక్స్‌క్యూజ్ మి! కొంచెం జరుగుతారా?'' అంది.

గౌరీనాథ్ కళ్ళు తెరిచాడు. క్రీనీడలో కనిపించిందామె.

పక్కకు సర్దుకుని కూర్చున్నాడు.

''థాంక్స్'' అతని పక్కసీటులో ఒద్దికగా కూర్చుంది.

బస్సు బయల్దేరింది.

సీటులో నుండి కొద్దిగా పైకి లేచి చుట్టూ కొంగు కప్పుకుని సర్దుకుని కూర్చుందామె.


తల పక్కకు తిప్పకపోయినా కూడా అతను గమనించాడు.

చలిగా వుంది కాబోలు అనుకుని కిటికీ గ్లాసు క్లోజ్ చేశాడు.

పెదనాన్నగారి ఇంట్లో జరిగిన ఫంక్షన్‌లో రోజంతా చలాకీగా అటూ ఇటూ తిరుగుతూ పనులు చేసినందున అలసిన ఆమెకు బాగా నిద్రపట్టింది.

గాయత్రికి మెలకువ వచ్చేటప్పటికి బస్సు ఆగివుంది. ముందూ, వెనుక చాలా వాహనాలు నిలిచి వున్నాయి.

ట్రాఫిక్ జామ్ అయిందని అర్థమైందామెకు.



అరుణ

పక్కసీటులో కూర్చున్న వ్యక్తి కిటికీలో నుండి బయటికి చూస్తున్నాడు. కొంతమంది బస్సు దిగి పరిస్థితి సమీక్షించి ట్రాఫిక్ క్లియర్ అవడానికి ఇంకా టైమ్ పడుతుందనుకుంటున్నారు.

వాచీలో టైమ్ చూసింది గాయత్రి. తెల్లవారు ఝాము నాలుగున్నరవుతోంది. మరో గంట గడిచింది. విసుగ్గా అనిపించినా ఏమీ చేయలేక కొందరు అలాగే కూర్చుని వున్నారు. మరికొందరు బస్సుదిగి దగ్గరలో ఉన్న ధాబా వద్దకు వెళ్ళి ముఖం కడుక్కుని కాఫీ తాగుతున్నారు. ఇంకొందరు దంత ధావనం చేయకుండానే కాఫీ, టీ సేవిస్తున్నారు.

నెమ్మదిగా చీకట్లు తొలగి వెలుగు రేకలు పరుచుకుంటున్నాయి. సమీపంలో రోడ్డ పక్కన వున్న వ్యవసాయ భూమిలో మోటర్ ఆన్‌చేసి వుంది. మొక్కలకు నీరు వెళుతోంది.

బ్రీఫ్‌కేస్‌లో నుండి బ్రష్ ప్యాకెట్ తీసుకుని లేచాడు గోపీనాథ్. అతను వెళ్ళడానికి వీలుగా కాళ్ళు కొద్దిగా పక్కకు జరిపింది గాయత్రి.

ముఖం కడుక్కున్న తర్వాత నిద్రమత్తు వదలి బడలిక తీరినట్లుగా అనిపించింది అతనికి.

''కాఫీ కావాలా సార్?'' దగ్గరకు వచ్చి అడిగాడు పదేళ్ళ కుర్రాడు చేతిలో కాఫీ కెటిల్‌తో.

''వద్దు'' బస్సు ఎక్కి సీటు దగ్గరకు వచ్చాడు గౌరీనాథ్. ఆమె ముఖంవైపు చూసిన గౌరీనాథ్ ఆశ్చర్యపోయాడు. అతని పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి.

గాయత్రి కూడా అతనివైపు చూసి ఆశ్చర్యపడింది. ఆమె ముఖంలో నవ్వు చోటుచేసుకుంది. తన సీటులో కూర్చున్నాడు గౌరీనాథ్.

''రాత్రి నుండి నా పక్కన కూర్చున్నది మీరేనని ఇప్పటివరకూ తెలియదు. చీకటిలో మిమ్మల్ని గుర్తించలేకపోయాను. అయామ్ వెరీ సారీ!'' బ్రీఫ్‌కేస్‌లో బ్రష్, టంగ్ క్లీనర్ పెట్టి మూసివేస్తూ అన్నాడు.

నవ్విందామె. ''నా పక్కన ఉన్నది మీరేనని నాకూ ఇప్పటివరకు తెలియదు. మిమ్మల్ని గుర్తించలేకపోయినందుకు నేను కూడా సారీ చెబుతున్నాను'' లేచి వెళ్ళి మోటార్ దగ్గర బ్రష్ చేసుకుంది. చల్లటి నీళ్ళతో ముఖం కడుక్కుని కర్చీఫ్‌తో తుడుచుకుంది. ఫ్రెష్‌గా అనిపించిందామెకు. వచ్చి సీటులో కూర్చుంది.

''కాఫీ తీసుకుంటారా?'' అడిగాడు గౌరీనాథ్.

''ఊహూ! వద్దు. నాకు అలవాటు లేదు'' అందామె.

''హైదరాబాద్ ఎపుడొచ్చారు? ఫోన్‌చేస్తే వచ్చి మిమ్మల్ని కలుసుకునేవాడిని కదా!'' అన్నాడతను.

కొంచెం సిగ్గుపడింది గాయత్రి.

''మొన్న వచ్చాను. వనస్థలిపురంలో మా పెదనాన్నగారు ఇల్లు కట్టుకున్నారు. నిన్న గృహప్రవేశం జరిగింది. మా కజిన్స్ అందరితో సరదాగా రెండు రోజులు గడపాలనిపించి హైదరాబాద్ వచ్చాను. నాన్న మీ ఫోన్ నెంబర్ ఇచ్చారు. కానీ మీకు ఫోన్‌చేసి మాట్లాడటానికి మొహమాటమనిపించింది. మా చుట్టాలందరూ నన్ను ఆటపట్టిస్తారని భయమేసింది. అందుకే మీకు ఫోన్ చేయలేదు'' చెప్పిందామె తలదించుకుని.

నవ్వి ఆమె ముఖంలోకి చూశాడతను.

గౌరీనాథ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. గాయత్రి విజయవాడలో బ్యాంక్‌లో పనిచేస్తోంది. వారిద్దరికీ పదిహేను రోజుల క్రితం వివాహం నిశ్చయమైంది.

అమెరికాలో ఉన్న చెల్లెలు ఆరు వారాల తర్వాత ఇండియా వస్తుంది కాబట్టి వచ్చిన తర్వాత పెళ్ళి జరపాలని గౌరీనాథ్ కోరాడు.



తన వివాహాన్ని చెల్లెలు, బావగారు చూడాలన్న ఆశతో అతను అడిగిన చిన్న కోరికను పెద్దలు కాదనలేకపోయారు. ఫలితంగా రెండు నెలల తర్వాత పెళ్ళి చేయాలని ముహూర్తం నిర్ణయించారు. ఇప్పుడు బస్సులో అనుకోకుండా కలుసుకున్న వైనం వారికి చిత్రంగా అనిపించింది.

''థాంక్ గాడ్! రాత్రి నుండి మనం ఒకరినొకరం చూడకపోయినా కనీసం ఇప్పుడైనా చూసుకున్నాం'' అన్నాడతను.

''అవును'' అందామె.

''గృహప్రవేశానికి మీ అమ్మానాన్నగారు వచ్చారా?'' అడిగాడు.

## యానా విసుర్లు

మోడలింగ్ రంగం నుంచి తళుకుబెళుకుల సినీరంగంలోకొచ్చిన వాళ్లంతా మీడియా ప్రభావానికి లోనవుతుంటారు. ప్రచారం కోసం ప్రాకులాడే తారలు ఒక్కొక్కసారి మీడియాపై విరుచుకుపడుతుంటారు. మోడల్‌గా అందర్కీ చిరపరచితమైన యానాగుప్తా బాలీవుడ్‌లోకి ప్రవేశించింది. ఆమె నటిస్తున్న కొత్త చిత్రంలో సీన్స్ కొన్నింటినీ పరిశీలించిన జర్నలిస్టులు ఆమెని ప్రశ్నల మీద ప్రశ్నలు గుప్పించారుట. ఫలానా సినిమాలో సీన్స్‌లా ఉన్నాయంటూ ఆమె దృష్టికి తెస్తే ఒక్కసారిగా కోప్పడిందిట. మీడియా తన పరువు తీస్తోందంటూ అరిచిగగ్గోలు పెట్టి అక్కడ్నించి జారుకుందట.

''వచ్చారు. ఇప్పుడు హైదరాబాద్‌లోనే వున్నారు. రేపు రాజమండ్రి తిరిగి వెళుతూ విజయవాడలో దిగి నా దగ్గర ఒకరోజు వుండి వెళతారు. మీ అమ్మగారు, నాన్నగారు బావున్నారా?'' అడిగిందామె.

''బావున్నారు. ఇప్పుడు అమలాపురంలోనే వున్నారు. నా దగ్గరకు వచ్చి వుండమని ఎన్నిసార్లు అడిగినా రారు. సొంత ఊరు మీద వాళ్ళకు ఉన్న మమకారం అలాంటిది''

''మీరిపుడు...'' ప్రశ్నార్థకంగా ఆగిపోయింది. ఆమె అడగదల్చుకున్నదేమిటో అతనికి అర్థమైంది.

''విజయవాడలో ఈ ఉదయం 9 గంటలకు మా ఫ్రెండ్ కిరణ్ పెళ్ళి. వాడి పెళ్ళికి వస్తున్నాను'' చెప్పాడు గౌరీనాథ్.

''నాతోపాటు ఇంటికి వచ్చి స్నానం చేసి వెళ్ళండి'' అంది.

నవ్వాడు కాని సమాధానం చెప్పలేదు.

ఇంకేం మాట్లాడాలో వారికి తోచలేదు. మౌనంగా కూర్చున్నారు ఇద్దరూ.

రెండు గంటలు ఆలస్యంగా బస్సు గమ్యస్థానం చేరుకుంది. బస్సుదిగి ఆటోవైపు నడుస్తూ ''ఇల్లెక్కడ?'' ఆమెను అడిగాడు.

''బృందావన్ కాలనీ'' చెప్పింది గాయత్రి.

ఆటో మాట్లాడి ఎక్కమన్నట్లుగా చూసాడు. ఎక్కి కూర్చుంది. అతను కూడా ఎక్కి ఆమె పక్కన కూర్చున్నాడు.

ఇంటిముందు ఆటో ఆగాక ఇద్దరూ దిగారు.

''ఇంట్లోకి రండి'' ఆహ్వానించిందామె.

''ఉహు! వెళతాను''

ఒక్క క్షణం తటపటాయించి అడిగాడు-

''సాయంత్రం నేను మీ ఇంటికి రావచ్చా?''

''రండి'' ఫస్ట్‌ఫ్లోర్‌లో తన పోర్షన్ చూపించింది.

''ఓకె. సీయూ'' చిరునవ్వుతో సెలవుతీసుకున్నాడు.

సాయంత్రం ఆరు గంటలకు వచ్చాడతను.

''రండి. కూర్చోండి'' కుర్చీ చూపి మంచి నీళ్ళు అందించింది.

బ్రీఫ్‌కేస్‌లో నుండి స్క్రిబ్లింగ్ ప్యాడ్ తీశాడతను. కిచెన్‌లోకి వెళ్ళిందామె.

గాయత్రి కాంప్లాన్ తయారుచేసి తీసుకు వచ్చేటప్పటికి శ్రద్ధగా ఇంటిప్లాన్ వేస్తున్నాడు గౌరీనాథ్.

అలికిడికి తలెత్తి చూశాడు.

ప్లాన్ వేయడం చకచకా పూర్తిచేసి ఆమె చేతిలో నుండి గ్లాస్ అందుకున్నాడు.

''హైదరాబాద్‌లో నాకు తెలిసిన వాళ్ళ ఇల్లు అమ్ముతున్నారు. సుమారు రెండేళ్ళ క్రితం కట్టిన ఇల్లు. నాకు నచ్చింది. కాని ఇల్లు కొనాలని నిర్ణయం తీసుకునే ముందు ఈ విషయంలో మిమ్మల్ని సంప్రదించి మీ అభిప్రాయం కూడా తెలుసుకోవాలనిపించింది'' కాగితాన్ని ఆమెకందించాడు.

''ప్లాన్ చూడండి. మీకు నచ్చిందా? రీ మోడల్ చేయాలంటే చెప్పండి. మీకు కావలసినట్లుగా మార్పులు చేద్దాం. ఉదయం మీరు బస్సులో కలవకపోయినా కూడా ఈరోజు మిమ్మల్ని కలిసి ఈ విషయం అడగాలని నేను నాలుగురోజుల క్రితమే అనుకున్నాను''

అతను నీట్‌గా వేసిన ప్లాన్‌ను తదేకంగా చూసింది. ఆమె పెదవులపై చిరునవ్వు.

''ఈ విషయాలు నాకు అంతగా తెలియవు. మీకు ఎలా నచ్చితే అలా చేయండి. ఎలా వున్నా నేను సర్దుకుపోగలను''

''థాంక్యూ''

''హైదరాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ కావాలని రిక్వెస్ట్ అప్లికేషన్ సబ్మిట్ చేశాను. త్వరలోనే ఆర్డర్స్ వస్తాయి'' అందామె.

నవ్వాడతను. ''దుర్గ గుడికి వెళదాం వస్తారా?'' అడిగాడు.

''అలాగే. కాని ఒక చిన్న కోరిక. నన్ను 'మీరు' అని బహువచనంతో సంబోధిస్తున్నారు. పేరుపెట్టి పిలవండి చాలు''

''పెళ్ళయ్యేవరకూ నాకు మీరు పరాయి స్త్రీ కాబట్టి అలాగే బావుంటుంది'' సున్నితంగా చెప్పాడు.

ఆటోలో వెళుతున్నప్పుడు, ఆలయంలో కూడా ఆమెకు కొంచెం దూరంగా ఉన్నాడతను. ఆమెను తాకడానికి ఏమాత్రం ప్రయత్నం చేయలేదు. అతని ప్రవర్తన ముచ్చటగా, సంతోషంగా అనిపించిందామెకు. కానీ తాను అతనికి కాబోయే భార్య అయినప్పటికీ అతను తనతో హుందాగా ప్రవర్తించడం, సున్నితంగా మాట్లాడడం, అతని చూపులు స్వచ్ఛంగా వుండటం ఆమెకు ఎంతో ఆనందంగా అనిపించింది.

దైవదర్శనం చేసుకుని ఇంటికి వచ్చాక పదిని ముషాలు కూర్చుని లేచాడు గౌరీనాథ్.

''అమలాపురం వెళ్ళి అమ్మానాన్నల దగ్గర ఒక రోజు వుండి హైదరాబాద్ వెళతాను''

''భోజనం చేసి వెళ్ళవచ్చు వుండండి. అరగంటలో వంట చేస్తాను'' అంది లేచి కిచెన్‌లోకి వెళ్ళబోతూ.

''వద్దు'' ఆమెను వారించాడు. ''పెళ్ళయ్యాక మీ చేతివంట తింటాను. ఇప్పుడు కాదు''

నిరాశగా చూసిందామె.

చిన్నబుచ్చుకున్న ఆమెకు ఊరట కలిగిస్తూ అన్నాడు ''మధ్యాహ్నం పెళ్ళిలో ఆలస్యంగా భోజనం చేశాను. ఈ పూట భోజనం చేయదల్చుకోలేదు''''ఈరోజు ఇలా కొద్దిసేపు మీతో కలిసి గడపడం నాకు చాలా సంతోషంగా ఉంది. మీరు కూడా నాలాగే హేపీగా ఫీలవుతున్నారని ఆశిస్తున్నాను. బహుశా మన పెళ్ళిలోనే మళ్లీ కలుసుకుంటాం మనం. వస్తాను'' మెట్లు దిగి తనతో పాటు గేటువరకు వచ్చి వీడ్కోలు పలుకుతున్న గాయత్రితో అన్నాడు గోపీనాథ్.

ఆనందంగా నవ్విందామె.

గాయత్రి కళ్ళలోని మెరుపును గ్రహించిన కింద పోర్షన్‌లో వుండే గృహిణి ''అతను నీకు కాబోయే శ్రీవారు కదూ!'' అని అడిగింది గుమ్మంలో నిలబడి. అవునన్నట్లుగా నవ్వుతూ తలూపింది గాయత్రి.

★ ★ ★

అర్నెల్ల ఐదు రోజుల తర్వాత-

ఊటీలోని హోటల్‌రూమ్‌లో-

బాల్కనీలో నిలబడి ప్రకృతి అందాలను చూసి పరవశించిన గౌరీనాథ్ గదిలోకి వచ్చాడు.

స్నానం చేసి వచ్చి చీర కట్టుకుంటోంది గాయత్రి. మెడలో మెరుస్తోన్న మంగళ సూత్రాలు, నల్లపూసల గొలుసుతో వింతశోభతో కనిపిస్తోన్న భార్యను పక్కనుండి వచ్చి హత్తుకున్నాడు.

తలతిప్పి అతనివైపు చూసింది.

చీరను గాయత్రికి చుట్టబెట్టి సన్నగా, నాజూకుగా ఉన్న ఆమెను రెండు చేతులతో ఎత్తుకుని మంచం వద్దకు తీసుకువెళ్ళి పడుకోబెట్టాడు.

తనకు సన్నిహితంగా ఉన్న భర్తతో అందామె...

''నేను పిలిచేవరకూ బాల్కనీలో నుండి రావద్దంటే ఇప్పుడే ఎందుకొచ్చారు? ఈ మూడు రోజుల నుండి మీ అల్లరి చూస్తోంటే ఆశ్చర్యంగా వుంది. పెళ్ళికి ముందు మిమ్మల్ని చూసి గుడ్ బోయ్ అనుకున్నాను. మరీ ఇంత అల్లరి చేస్తారని అనుకోలేదు. నన్ను చీర కట్టుకోనివ్వండి'' అతన్ని వారిస్తూ అంది.

కుడివైపు బ్లౌజ్ కొంచెం కిందికి జరిపి నునుపైన ఆమె భుజం మీద సున్నితంగా ముద్దు పెట్టుకున్నాడు. ఆమె చెంపలమీద చుంబించాడు. పక్కన పడుకుని ఆమె ముఖాన్ని తనవైపు తిప్పుకున్నాడు.

''పెళ్ళికి ముందు మనం ఎవరి హద్దుల్లో వాళ్ళం వున్నాం. ఇప్పుడు పెళ్ళయ్యాక ఆ హద్దులను చెరిపేసి, ఇలా నిన్ను హత్తుకోవడం, ముద్దుల్లో ముంచెత్తడం ఎంతో ఆనందంగా వుంది. ఈ ప్రపంచంలో ఇలా నీ దగ్గర మాత్రమే చేస్తాను కాని ఇంకెవ్వరి దగ్గరా అల్లరి చేయను. నేను మంచి వాడినా, కాదా నువ్వే చెప్పు'' అన్నాడు.

''మీరు నిజంగా గుడ్ హజ్బెండ్ అని ఒప్పుకుంటున్నాను. మీ ప్రవర్తన ఎంత హుందాగా ఉంటుందో నాకు బాగా తెలుసు. మీరు ఎప్పుడు అల్లరి చేస్తున్నా నేను కాదనను. మీ ఆనందం కంటే నాకు ఇంకేమి కావాలి? మీ ఇష్టం వచ్చిన రీతిలో నా నుండి సంతోషం పొందండి'' అతనికి సహకరిస్తూ అందామె.

''నీ సంపూర్ణ సహకారానికి నా కృతజ్ఞతలు'' చాలాసేపటి తర్వాత అన్నాడతను, ఆలౌకికమైన ఆనందంతో.

ఇద్దరూ నవ్వుకున్నారు మనసారా.

☆

